# నా మాటల్లో నిజాయితీ ఉంటే ఆశీర్వదించండి

- ప్రజలకు కావాల్సిన అవసరాలను పూర్తిచేశా
- మిగిలిన వాటిని పూర్తిచేసే బాధ్యత నాదే..
- కాంగ్రెసోళ్లు కరెంట్, సాగునీరు కల్పించడంలో విఫలం
- 'గృహలక్ష్మి'తో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇల్లు ఇస్తా
- వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఖిల్లా ఘణపురం మండలంలో జోరుగా ప్రచారం



ఖిల్లా ఘణపురం మండలంలో ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘణపురం, నవంబర్ 23 : నా మాటల్లో నిజాయితీ, ధర్మం ఉంటే నన్ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంతో పాటు మండలంలోని వెనక్కితండా, ముందరితండా, కర్నెతండా, ఆముదంబండతండా, షాపూర్, మానాజీపేట, దొంటికుంటతండా, సోలీపూర్, రుక్కన్నపల్లి, ఉప్పర్‌పల్లి, సూరాయపల్లి, బోజ్జాయిపల్లి గ్రామంలో ఆయన మండల నాయకులతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాయితీ, నికార్సుతో పనిచేసి ప్రజల ఆధారాభిమానాలు పొందానని తెలిపారు. ప్రజలకు ఎంతో చేశానని కానీ చేయాల్సిన పనులు ఇంకా మిగిపోయాయని వాటన్నింటినీ పూర్తిచేయాలంటే మీరు నమ్మకంతో తనను గెలిపించాలన్నారు. గృహలక్ష్మి పథకం ద్వారా మండలంలోని అన్ని గ్రామాల్లోప్రతి ఒక్కరికి ఇల్లు వచ్చేలా న్యాయం చేస్తానన్నారు. కల్లిబొల్లి మాటలు చెప్పే కాంగ్రెస్ నాయకులకు తెలంగాణలో చీకటి రోజులు అలుముకున్నాయని, దేశానికి దిక్సూచిలా తెలంగాణ పథకాలు శ్రీరామరక్షగా ఉన్నాయని, అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిన తెలంగాణ ప్రజల ముందుకు అద్దంపట్టేలా చూపించామన్నారు. తెలంగాణలోని పథకాలను అధ్యయనం చేయడానికి పలు రాష్ట్రాల నాయకులు, ఇక్కడికి వచ్చి పోతున్నారని గుర్తుచేశారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, సాగునీటి, విద్యుత్ తదితర పథకాలను అధ్యాయనం చేస్తున్నారన్నారు. గత పాలకులు వ్యవసాయం దండుగ అన్నారని అలాంటి వ్యవసాయాన్ని అందరి ఆశీస్సులతో దేశంలోనే ముందు వరుసలో నిలిపిన ఘనత కేసీఆర్‌దన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కరెంట్, వ్యవసాయం, వలసలు, పింఛన్ల కోసం ఎదురుచూసే పరిస్థితులు గుర్తుచేసుకుంటే కన్నీరు తప్పా ఏమి గుర్తు రావన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో ఎంత మార్పు వచ్చిందో ప్రజలు గమనించాలన్నారు. తొమ్మిదిన్నరేండ్ల పాలనలో రైతుల ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయనే ఆలోచనతోనే దశలవారీగా ఏడాదికి ఎకరాకు రూ.16వేలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పొలం ఉన్న వారికి రైతుబీమా, భూమి లేని వారికి కేసీఆర్ బీమాను అమలు చేస్తామన్నారు. ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అన్ని సమకూర్చి ఉంటే తెలంగాణ ఉద్యమం ఎందుకు వస్తుందని ఆయన ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్లలో లక్షా62వేల ఉద్యోగాలు తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిందని ఇంకా యువకులకు ఉద్యోగాలను కల్పించేందుకు ముందుకు సాగుతున్నామన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఏర్పాటు చేసే అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను పక్కదారి పట్టించేందుకు అబద్ధాలను ప్రజలకు చెప్పే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. యువతకు ఏదైన వట్టిగా రాదు కష్టపడితేనే వస్తుందన్నారు. తెలంగాణలో ప్రవేశపెట్టిన పథకాలు గత పాలకులు ఎందుకు ప్రవేశపెట్టలేదన్నారు. 40 ఏండ్ల నుంచి కాంగ్రెస్ అంటేనే చిన్నారెడ్డి, చిన్నారెడ్డి అంటేనే కాంగ్రెస్ అనే విధంగా ఉండేదని, ఢిల్లీకి పోయి ఓటుకు నోటుకు సూట్‌కేసులు ఇచ్చి కాంగ్రెస్ టికెట్‌ను తెచ్చుకున్నారని, అలాంటి వారు భవిష్యత్‌లో ఎలా ఉద్దరిస్తారో అర్థం చేసుకోవాలన్నారు. వనపర్తి జిల్లా ఉన్నత విద్య పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చానన్నారు. ఇంతా అభివృద్ధి చేసిన నాకు ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**గ్రామాల్లో మంత్రికి ఘన స్వాగతం..**

మండలకేంద్రంతోపాటు మండలంలోని గిరిజన తండాలు, గ్రామాల్లో ఎన్నికల ప్రచారానికి వచ్చిన మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుడు నందకిశోర్ మంత్రిని గజమాలతో సత్కరించారు. మండల కేంద్రంలో 1500మందికి పైగా ఆయన వెంట నడిచి ప్రచారం నిర్వహించారు. మునుపెన్నడూ లేనివిధంగా మండల కేంద్రం గులాబీమయంగా మారింది. మండల కేంద్రం లో పర్యటిస్తున్న ఆయనకు స్వచ్ఛందంగా రైతులు, మహిళలు, యువకులు, వృద్ధులు ఇంటి నుంచి బయటికి వచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కృష్ణనాయక్, జెడ్పీటీసీ సామ్యనాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్లకృష్ణయ్య, రాష్ట్ర డైరెక్టర్లు లక్ష్మారెడ్డి, పురుషోత్తం, కార్మిక సంఘం అధ్యక్షుడు విక్రమ్, సర్పంచ్ వెంకటరమణ, నాయకులు నాగం తిరుపతిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లేశ్, ఆంజనేయులుగౌడ్, శరత్, సత్యం, బుచ్చిబాబు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకు లు, కార్యకర్తలు, యువకులు పాల్గొన్నారు.



## నా ఓటు కారు గుర్తుకే ..

వనపర్తి నియోజకవర్గ అభ్యర్థి వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి గురువారం ఖిలాఘణపురం మండలం కర్నె తండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డమ్మీ ఈవీఎంలతో ఓటు వేసే విధానాన్ని గిరిజన మహిళలకు అవగాహన కల్పించారు. దీంతో కొందరు మహిళలు మేము కారు గుర్తుకే ఓటు వేస్తామని ముక్తకంఠంతో పోటీపడి డమ్మీ ఈవీఎంపై కారు గుర్తును నొక్కారు. ఈ దృశ్యాన్ని 'నమస్తే తెలంగాణ' కెమెరాలో బంధించింది..

-వనపర్తి ఫొటో గ్రాఫర్, నమస్తే తెలంగాణ

# ఎన్నికల్లో పీవో, ఏపీవోలదే ప్రధాన భూమిక

- ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్ మిశ్రా

వనపర్తి,నవంబర్ 23: ఎన్నికల నిర్వహణలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులదే ప్రధాన భూమిక ఉంటుందని వనపర్తి ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్‌మిశ్రా అన్నారు. గురువారం కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు నిర్వహించిన రెండో దఫా శిక్షణ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి తేజస్‌నందలాల్ పవార్‌తో కలిసి సాధారణ పరిశీలకులు సోమేష్‌మిశ్రా పరిశీలించారు. ఆరు తరగతి గదుల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాలను సందర్శించి శిక్షణ కార్యక్రమం తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామంలో ఎన్నికలు ప్రధానమైతే అది విజయవంతం కావడంలో పీవో, ఏపీవోలదే కీలక పాత్ర ఉంటుందన్నారు. వారు ఎంతబాగా శిక్షణ పొందితే ఎన్నికలు అంత సజావుగా జరిగినట్లేనన్నారు. కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లను అమర్చడం, మాక్ పోలింగ్ నిర్వహించడం, క్లియర్ చేసి స్లిప్‌లు తొలిగించడం వంటివి ప్రధానంగా ఉంటాయన్నారు. వాటికి తోడు అన్ని రకాలైన ప్రోఫార్మాలను పూరించడం ఉంటుందన్నారు. అందుకే అనువంత అనుమానం ఉన్న శిక్షణలోనే ఒకటికి పదిసార్లు నివృత్తి చేసుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు చాలా నమ్మకంతో ఉన్నారని వారి నమ్మకాని వమ్ము చేయకుండా ఎన్నికలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రతిదీ ఎన్నికల నియమావళికి లోబడి ఉండాలన్నారు. అనంతరం అక్కడనే పోలింగ్‌లో విధుల్లో నిర్వహించే సిబ్బందికి ఏర్పాట్లు చేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. మహబుబ్‌నగర్, అలంపూర్ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహించగా ఈరోజు 5 ఓట్లు పోల్ అయ్యాయని సహాయ రిటర్నింగ్ అధికారి కిషన్ తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనింగ్స్, శిక్షణ పీవో, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్ మిశ్రా

**ప్రారంభమైన ఈవీఎం, వీవీ ప్యాట్ల కమిషనింగ్**

జిల్లా కేంద్రంలో వనపర్తి నియోజకవర్గానికి సంబంధించిన ఈవీఎం, వీవీ ప్యాట్ల కమిషనింగ్ ప్రారంభమైనట్లు కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తెలిపారు. గురువారం చిట్యాల ఏఎం సీ వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఎన్నికల సెక్టోరియల్ అధికారులతో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థు ముందు వనపర్తి రిటర్నింగ్ అధికారి తిరుపతిరావు, కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు సోమేశ్ మిశ్రాల ఆధ్వర్యంలో ఈవీఎం, వీవీ ప్యాట్లల కమీషనింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈసీఐ నిబంధనల ప్రకారం ఈవీఎంల రెండో దశ ర్యాండమైజేషన్ ప్రకారం క్రమ పద్ధతిలో మ్యాచింగ్ చేసిన బ్యాచింగ్‌ను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన కంట్రోల్, యూనిట్ బ్యాలెట్ యూనిట్ల, ,వీవీ ప్యాట్లలను వీడియోగ్రఫీ ద్వారా తెరిచి ఈవీఎంలను ఈసీఐఎల్, బెల్ ఇంజినీర్లతో ఈవీఎంల కమిషనింగ్ చేసినట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గలో 28సెక్టోరియల్ బృందాలు, 28 రూట్లలో వారీగా ఈనెల 23,24 తేదీల్లో కమీషనింగ్ చేసి స్ట్రాంగ్ రూంలో భద్రపరుస్తారని తెలియజేశారు. అధికారులందరూ ఈవీఎం కమీషనింగ్‌పై ఎలాంటి అనుమానం లేకుండా సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని అధికారులకు సూచించారు.కార్యక్రమంలో నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జూపల్లికి మతిభ్రమించింది..

- ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలి
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి




వల్లభాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

వీపనగండ్ల, నవంబర్ 23 : అప్పు చేయడం తప్పు కాదు.. కానీ అడ్డదారిలో అప్పు చేసి అక్రమ ఆస్తులను సంపాదించి కుర్చీ కోసం తహతహలాడుతున్న మాజీ మంత్రికి మతిభ్రమించి ఏది పడితే అది మాట్లాడుతున్నారని, అలాంటి వారికి కొల్లాపూర్ ప్రజలు ఓటుతోనే తగిన బుద్ధి చెప్పాలని కొల్లాపూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని సంపత్‌రావుపల్లి, వల్లభాపురం తండా, వల్లభాపురం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆసరా, రైతులకు రైతు బంధు, రుణమాఫీ, రైతు బీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముభారక్, కేసీఆర్ కిట్టు వంటి దాదాపుగా వంద వరకు సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. రెండు యేండ్లు కరోనా కష్టాలు వచ్చినప్పటికీ అన్ని విధాలుగా ప్రజలకు తోడుగా ఉన్నాను. మిగిలిన మూడేండ్లలో కొల్లాపూర్ ప్రాంతానికి చేసిన అభివృద్ధి మీ కళ్ల ముందు ఉన్న విషయాన్ని గమనించాలని కోరారు. రూ.147 కోట్లతో సింగోటం– గోపల్‌దిన్నె లింక్ పనులు ప్రారంభం చేసినట్లు చెప్పారు. ఎన్నికల తరువాత పనులు పూర్తి చేసి వీపనగండ్ల, చిన్నంబావి, పెంట్లవెళ్లి మండలాలకు సంబంధించిన భూములకు పూర్తి స్థాయిలో సాగునీరు అందించడమే లక్ష్యంగా పని చేయడం జరుగుతుందన్నారు. తూంకుట నుంచి సంపత్‌రావుపల్లి మీదుగా నేరుగా జటప్రోల్ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తానన్ని హామీ ఇచ్చారు. సంపత్‌రావుపల్లి గ్రామంలో సొంత నిధులతో గుడి నిర్మాణం చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా సంపత్‌రావుపల్లి గ్రామానికి చుట్టపక్కల గ్రామాలకు బీటీ రోడ్డు వేయించడం జరిగిందన్నారు. వల్లభాపురంతండా అభివృద్ధి కోసం నిరంతరం తోడుగా ఉంటానన్ని మాటిచ్చారు. మాదాసి కురుమ సంఘం అధ్యక్షుడు విజయ్‌కుమార్, గొర్రెల కాపరుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసెంబ్లీలో మాదాసీ మదారీ కురుమల సర్టిఫికెట్స్ కోసం డిమాండ్ చేసిన బీరంను గెలిపించి కొల్లాపూర్ కోటపై గులాబీ జెండా ఎగురవేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కమలేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ రామన్‌గౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సర్పంచులు రామేశ్వర్‌రావు, అంజయ్యనాయక్, బీఆర్ఎస్ నాయకులు తేజరెడ్డి, దామోదర్‌రెడ్డి, సాయిరాం, శివ, కిరణ్ కుమార్‌గౌడ్, ఎల్లస్వామి, మహేశ్, వేణుమాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.